06ATP27_06ATP27.qxd 25-07-2024 PM 10:19 Page 1



# త్వరితగతిన రీ సర్వే పనులు పూర్తిచేయండి

**- జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్**



రికార్డు గదిలో రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

**బత్తలపల్లి, జులై 25 ప్రభాతవార్త**

మండలంలోని అన్ని గ్రామాలలో త్వరితగతిన భూముల రీసర్వే పూర్తి చేయాలని మండల రెవెన్యూ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డితో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆయన కార్యాలయంలోని రికార్డు గదిని పరిశీలించారు. కార్యాలయంలో సిసి కెమరాలు ఏర్పాటు చేయాలన్నారు. రికార్డు గదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. రికార్డు రూముల భద్రతపై సూచనలు చేశారు. కార్యాలయంలో రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే వారు



రెవెన్యూ అధికారులతో సమావేశమైన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

అప్రమత్తతతో వుండాలన్నారు. విఆర్‌ఓలు రాత్రి వేళల్లో కార్యాలయంపై నిఘా వుంచాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం సర్వేయర్లు, విఆర్‌ఓలతో సమావేశమయ్యారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణపై ఆరాతీశారు. ఎంత వరకు అండగళ్‌లో నమోదు, గ్రామాలలో రీ సెటిల్‌మెంట్ రికార్డుల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే ఎన్ని గ్రామాలలో పూర్తయ్యింది, ఇంకా ఎన్ని గ్రామాలలో పూర్తి కావాల్సి వుందో రీసర్వే డిప్యూటి తహాశీల్దార్ సునీతతో ఆరాతీశారు. హైకోర్టులలో ఏవైనా రిట్ పిటీషన్లు పెండిగ్‌లో వున్నాయా, వాట్టికి కౌంటర్ ధాఖలు చేశారా, ఏ స్టేజ్‌లో వున్నది విచారించారు. మ్యూటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యూటేషన్ ఫర్ కరెక్షన్‌కు సంబందించి రోజుకు ఎన్ని క్లియర్ చేస్తున్నారు అంటూ తహాశీల్దార్ శివశంకర్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు కార్యాలయంలోని గదులను, రికార్డు భద్రతపై ఆరాతీశారు. ఈ సమావేశంలో సిఎస్‌డిటి శారద, ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహ శర్మ, సీనియర్ అసిస్టెంట్ విజిత, జూనియర్ అసిస్టెంట్ హరిక్రిష్ణ, ట్రాన్స్ కో ఏఈ శివయ్య, కంప్యూటర్ ఆపరేటర్ చక్రపాణి, విఆర్‌ఓలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

## చిన్నారులకు ఉచిత ఆధార్ నమోదు

**అగళి, జులై 25 ప్రభాతవార్త**



ఆదార్ నమోదు చేస్తున్న దృశ్యం

చిన్నారులకు ఉచితంగా ఆధార్ నమోదు కార్యక్రమాన్ని అగళి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించారు. సంవత్సరం, రెండు సంవత్సరాలు, మూడు సంవత్సరాల వయస్సుగల చిన్నారులకు ప్రభుత్వం ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్‌ని ఏర్పాటు చేసి ఆధార్ నమోదు చేస్తోంది. ఇంకా రెండు రోజులపాటు చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తారు కావున ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలని కార్యదర్శి దొడ్డే గౌడ్ తెలిపారు.

# ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ హర్షనీయం

**- బీజీఎస్ జాతీయ అధ్యక్షుడు ఎస్.కె.మహేష్‌నాయక్**

**ఉరవకొండ, జూలై 25 ప్రభాతవార్త**



ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో బీజీఎస్ జాతీయ అధ్యక్షుడు ఎస్.కె.మహేష్‌నాయక్ (ఫైల్‌ఫోటో)

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరడం హర్షనీయమని బంజారా గిరిజన సమాఖ్య (బీజీఎస్) జాతీయ అధ్యక్షుడు ఎస్.కె.మహేష్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని 15 కోట్ల మంది బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ జన్మస్థలమైన గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో ప్రతి ఏడాది ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని ఇందులో లక్షలాది మంది బంజారాలు పాల్గొంటారన్నారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్సవాలకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. గతంలో చంద్రబాబునాయుడు సేవాఘడ్ అభివృద్ధికి నిధులు కేటాయించి, రోడ్లు కూడా వేయించారన్నారు. సేవాలాల్ ఉత్సవాలకు నిధులు అవసరమని విడుదల చేయాలని అనేకమార్లు అధికారులను కలిసి విన్నవించినా గత ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. అయితే రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకొని ముఖ్యమంత్రికు నిధులు మంజూరు చేయాలని కోరడం బట్టి చూస్తే బంజారా అభివృద్ధి, సంక్షేమానికి ఆయన చూపుతున్న చొరవకు దర్పణంగా నిలుస్తోందన్నారు.

# ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ

**-ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**

**ఉరవకొండ, జూలై 25 ప్రభాతవార్త**



సచివాలయం-2లో జరుగుతున్న ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ జి.వి.సుబ్బరాజు

పట్టణంలోని గాంధీ బజార్‌లోగల సచివాలయం-2లో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని గురువారం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి జి.వి.సుబ్బరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేసిన ఆయన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేక శిబిరం మరో రెండు రోజులు కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈఓఆర్‌డీ చంద్రమౌళి, మండల పరిషత్ ఏవో జయరాములు, మేజర్ పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ తదితరులు ఉన్నారు.

# సరసమైన ధరలలో నాణ్యమైన సరుకుల విక్రయం మూన్నాళ్ళ ముచ్చటేనా..?!

**-ఉరవకొండలో రిటైల్ దుకాణాలవద్ద బ్యానర్లు కూడా కనబడని దైన్యం**

**ఉరవకొండ, జూలై 25 ప్రభాతవార్త**

వినియోగదారుల వ్యవహారములు, ఆహార మరియు పౌర సరఫరాలశాఖ ఆదేశాల మేరకు రిటైల్ దుకాణాలవద్ద చేపట్టిన సరసమైన ధరలలో నాణ్యమైన సరుకుల అమ్మకాలు మూన్నాళ్ళ ముచ్చటగా మారింది. ఉరవకొండ పట్టణంలోని ప్రైవేటు బస్టాండ్, వైఎస్సార్ విగ్రహం కూడళిలోని రెండు పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాలవద్ద ఈనెల 12వ తేదీన విక్రయాలను రెవిన్యూ అధికారులు ప్రారంభించారు. ప్రారంభోత్సవం రోజు మాత్రం అందరికీ కనిపించేలా బ్యానర్ కట్టించి ప్రస్తుతం మార్కెట్‌లో కిలో 181 రూపాయలు ధర ఉన్న కందిపప్పును 160 రూపాయలకు, కిలో 55.85 రూపాయలు ధర ఉన్న స్టీమ్, బిపిటి/సోన మసూరి బియ్యంను 49 రూపాయలకు, కిలో 52.40 రూపాయలు ఉన్న పచ్చి, బిటిపి/సోన మసూరి బియ్యంను 48 రూపాయలకు విక్రయాలు జరిపించారు. మరుసటి రోజు నుంచి రాయితీ ధరలతో విక్రయాలకు సంబంధించిన బ్యానర్లు సైతం దుకాణాలవద్ద కనబడకపోగా విక్రయాల ఊసే లేకుండా పోయింది. పౌర సరఫరాలశాఖ అధికారులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సరసమైన ధరలలో నాణ్యమైన సరుకుల అమ్మకాలను కొనసాగించడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## వేరుశెనగ పంటను కాపాడుకోవడానికి జాగ్రత్తలు తీసుకోండి

**-వ్యాసాపురంలో పంట పరిశీలన సందర్బంగా ఏవో జి.శుభకర్**

**ఉరవకొండ, జూలై 25 ప్రభాతవార్త**



వ్యాసాపురం గ్రామంలో వేరుశెనగ పంటను పరిశీలిస్తున్న ఏవో జి.శుభకర్

వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సందర్భంగా పంటను కాపాడుకోవడానికి జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జి.శుభకర్ రైతులకు సూచించారు. గురువారం ఆయన మండల పరిధిలోని వ్యాసాపురం గ్రామంలో వర్షాధారం కింద సాగులోవున్న వేరుశెనగ పంటను పరిశీలించారు. ఈ సందర్బంగా ఏవో జి.శుభకర్ మాట్లాడుతూ పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అంతకు ముందు రాయంపల్లి, నెరమెట్ల, వ్యాసాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి కౌలు రైతులతో సమావేశాలు నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. కౌలు రైతులు గ్రామ రెవిన్యూ అధికారులను సంప్రదించి కౌలు రైతు కార్డులు పొందాలని సూచించారు. కౌలు రైతు కార్డులున్న వారు భవిష్యత్తులో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులవుతారన్నారు. పంట నమోదుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని నష్టపరిహారం లెక్కించే సమయంలో కౌలు రైతులను కూడా లెక్కించడానికి వీలుంటుందన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఏర్పడినందున ఇంకా చాలామంది రైతులు పంట పెట్టుకోలేదని వారికి ప్రత్యామ్నాయ విత్తనాలు అవసరమని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ప్రత్యామ్నాయ విత్తనాలు వచ్చిన వెంటనే రైతలందరికీ పంపిణీ చేయడం జరుగుతుందని ఏవో జి.శుభకర్ వివరించారు.

## భక్తిశ్రద్ధలతో కొనసాగిన పెద్ద సరిగెత్తు

**-నేడు పీర్ల అగ్నిగుండ ప్రవేశం, జలధి**

**ఉరవకొండ, జూలై 25 ప్రభాతవార్త**



కొలువైన చిన్న లాలుస్వామి పీర్లు

ఉరవకొండ ప్రాంతంలో చిన్న పీర్ల పండుగ వైభవంగా జరుగుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అనేక చోట్ల పీర్ల చావిళ్లతోపాటు వీధివీధిన తడికెలతో శిబిరాలు ఏర్పాటు చేసి పీర్లను కొలువుదీర్చిన విషయం తెలిసిందే. పెద్ద పీర్ల పండుగకు ఎంతమాత్రం తగ్గకుండా స్థానికులు, ముఖ్యంగా యువత పండుగలో పాలు పంచుకొంటూ పీర్ల చావిళ్లను సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. పెద్ద సరిగెత్తు సందర్బంగా గురువారం భక్తులు ఊరేగింపుగా డప్పు వాయిద్యాల మధ్య పీర్ల చావిళ్లకు వెళ్లి పానకాలు సమరి ఎంచి, చక్కెర తులాభారాలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని స్థానిక 4వ వార్డు ఉప్పరవీధిలోని పీర్ల చావిడిలో చిన్న లాలుస్వామి పీర్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకోవడానికి ఎగబడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున పీర్లు అగ్నిగుండ ప్రవేశం జరగనుండగా అదేరోజు సాయంత్రం పీర్లు జలధికి తరలనున్నాయి.

## పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలివున్న సీట్ల భర్తీకు 31న స్పాట్ అడ్మిషన్లు

**-ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అష్రఫ్ అలీ**

**ఉరవకొండ, జూలై 25 ప్రభాతవార్త**



విలేఖరులతో మాట్లాడుతున్న కె.అష్రఫ్ అలీ

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో ఇన్ ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సులలో మిగిలివున్న సీట్లను ఈనెల 31న నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రాఫ్ అలీ తెలిపారు. గురువారం ఆయన కళాశాల హెడ్ ఆఫ్ సెక్షన్ వై.సురేష్‌బాబుతో కలిసి స్థానిక విలేఖరులతో మాట్లాడారు. పాలిసెట్ తుది దశ కౌన్సిలింగ్ ముగిసిన నేపథ్యంలో మిగిలివున్న సీట్లను స్పాట్ అడ్మిషన్ విధానంలో భర్తీ చేయాలని విద్యాశాఖ సంచాలకులు, అడ్మిషన్ల కన్వీనర్ గుమ్మల గణేష్ కుమార్ తెలియజేశారన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులోవున్న సీట్ల వివరాలను శాఖలు, క్యాటగిరీల వారిగా జూలై 27న నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తామన్నారు. ఒరిజిల్ సర్టిఫికేట్లు, నిర్దేశించిన రుసుముతో జూలై 31న ఉదయం 10 గంటలకు వ్యక్తిగతంగా విద్యార్థులు సీటు ఆశిస్తున్న పాలిటెక్నిక్ కళాశాలకు హాజరుకావాలని కన్వీనర్ స్పష్టం చేశారన్నారు. పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ ద్వారా అప్పటికే కేటాయింపు పొందిన కోర్సులో ప్రవేశం తీసుకున్న అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులు కాదన్నారు. ప్రవేశం పొందిన అభ్యర్థులు పూర్తి ఫీజు 4,700 రూపాయలతోపాటు కౌన్సిలింగ్ ఫీజు 1,100 రూపాయలు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 350 రూపాయలు వెంటనే చెల్లించవలసి ఉంటుందన్నారు. ఈ స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తించబోదని ప్రిన్సిపల్ కె.అష్రఫ్ అలీ వివరించారు. వివరాల కోసం జనరల్ హెడ్ ఆఫ్ సెక్షన్‌ను ఫోన్ నంబర్ 91779 42568కు సంప్రదించాలని సూచించారు.

# సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలి

**-రాష్ట్ర సాధారణ బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి**

**-సీయం నారా చంద్రబాబునాయుడును కోరిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్**

**ఉరవకొండ, జూలై 25 ప్రభాతవార్త**



రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

గుత్తి మండలం సేవాఘడ్‌లో వెలసిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు 50 లక్షల రూపాయలు మంజూరు చేయాలని, ఈ మేరకు సాధారణ బడ్జెలో నిధులను కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. గురువారం మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జిల్లాలోని గుత్తి మండలం సేవాఘడ్‌లో జన్మించారని, ఆయన జయంతి ఉత్సవాలను ప్రతి ఏడాది 13 నుండి 15 వరకు దేశవ్యాప్తంగా జరుపుకుంటారన్నారు. సేవాలాల్ మహారాజ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, లక్షలాది మంది భక్తులు ఆయన జయంతి వేడుకలకు హాజరై సేవాఘడ్‌లో మాతా జగదాంబ, సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేస్తారన్నారు. 2019-2024 మధ్య కాలంలో రాష్ట్రంలో ఇంతకుముందు అధికారంలోవున్న ప్రభుత్వం ఉత్సవాలకు ఎటువంటి నిధులు మంజూరు చేయలేదన్నారు. ఉత్సవాల సమయంలో రవాణా, ఆహారం, వసతి, ఇతర సౌకర్యాల కోసం సంత్ సేవాలాల్ మహారాజ్ ఛారిటబుల్ ట్రస్ట్ వివిధ రుణాలు తీసుకున్నారన్నారు. 2014-2019 మధ్య తమ ప్రభుత్వం వేడుకలు నిర్వహించడానికి ప్రతి సంవత్సరం 25 లక్షల రూపాయలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 ఫిబ్రవరి 13 నుండి 15 వరకు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను నిర్వహించడం కోసం 50 లక్షల రూపాయలను మంజూరు చేయాలని మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. ఇందుకోసం సాధారణ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేయాలని ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అభ్యర్థించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల కోసం నిధుల మంజూరు, తర్వాత ఇక్కడ బడ్జెట్ అంచనాలలో కేటాయింపులు చేయడం కోసం సంబంధిత అధికారులు పరిశీలించి ఆదేశించవలసినదిగా ముఖ్యమంత్రిని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు.

## 29న గాంధీ హరిజన హాస్టల్ కమిటీ సభ్యుల అత్యవసర సమావేశం

**-గాంధీ హరిజన హాస్టల్ ఉరవకొండ తాలుకా కమిటీ**

**ఉరవకొండ, జూలై 25 ప్రభాతవార్త**

ఈనెల 29న సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని గాంధీ హరిజన హాస్టల్ కమిటీ సమావేశం హాస్టల్ ఆవరణంలో జరుగుతుందని హాస్టల్ ఉరవకొండ తాలుకా కమిటీ గురువారం ఇక ప్రకటనలో తెలిపింది. హాస్టల్ సమస్యను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టి ఇ తీసుకెళ్లి పరిష్కరించుకోవడం, హాస్టల్ గ్రామ, మండల కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి తాలుకాలోని హరిజన ప్రజలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, కుల సంఘాల నాయకులు తప్పక హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## బిసి కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం

**-గుమ్మనూరు నారాయణ**



కాలనీవాసలు సమస్యలు చెప్పకుంటున్న దృశ్యం

**గుత్తి, జూలై 25 ప్రభాతవార్త**

పట్టణంలోని బిసి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సోదరుడు, టిడిపి గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. గురువారం కాలనీలో ఆయన విస్తృతంగా పర్యటించారు. పలుచోట్ల మురుగునీటితో దుర్గంధంగా మారిన ప్రాంతాలను పరిశీలించారు. పారిశుద్ధ్యం, వీధిలైట్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. ప్రధానంగా తాగునీటి ఎద్దడి వుందని వారు అన్నారు. ఎమ్మెల్యే ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మాదిగల మహాధర్నా పోస్టర్లు విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

**గుత్తి, జూలై 25 ప్రభాతవార్త**

మాదిగల వర్గీకరణను చేపట్టి తమ సమస్యలు పరిష్కరించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు అంజన్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాదిగల మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు ఆధ్వర్యంలో ఢిల్లీలో ఆగస్టు 9న చేపట్టనున్న మహాధర్నాకు మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిరంజీవి, కార్యదర్శి సురేష్, అజయ్‌బాబు, రామాంజినేయులు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో రైతు మృతి

**గుత్తి, జూలై 25 ప్రభాతవార్త**



మృతి చెందిన రైతు

మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి (48) అనే రైతు పాముకాటుకు గురై మృతి చెందాడు. బుధవారం రాత్రి రైతు తన పొలంలో నిద్రిస్తున్న సమయంలో పాముకాటుకు గురయ్యాడు. అయితే సకాలంలో వైద్యం చేయించుకోకపోవడంతో గరువారంనతీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# రైల్వే లోకో ఇంజన్‌ను ప్రారంభించిన డిఆర్‌ఎం



లోకో ఇంజన్‌ను ఆర్‌ఎం ప్రారంభిస్తున్న దృశ్యం

**గుత్తి, జూలై 25 ప్రభాతవార్త**

గుత్తి రైల్వే షెడ్‌లో గురువారం గుంతకల్లు రైల్వే డివిజన్ డిఆర్‌ఎం విజయకుమార్ నూతనంగా కేటాయించిన లోకో ఇంజన్‌ను (69114)ను ప్రారంభించారు. స్థానిక డీజిల్‌షెడ్‌కు ఇండియన్ రైల్వే మరియు వెబ్‌టెక్ కంపెనీలు సంయుక్తంగా 250 లోకో ఇంజన్లను రైల్వే బోర్డు కేటాయించింది. ఈ మేరకు డిఆర్‌ఎం ఇంజన్‌కు పూజలు గావించి లాంచనంగా పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను కార్మిక సంఘాల నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ డిఎంఇ ప్రమోద్, గుంతకల్లు, గుత్తి రైల్వే అధికారులు, వెబ్‌టెక్ సంస్థ ప్రతినిధులు సందీప్, రజనీష్, కార్మిక సంఘం ప్రతినిధులు, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

## గుత్తికోటపై ట్రెక్కింగ్ చేసిన ఇంజనీరింగ్ విద్యార్థులు



విద్యార్థులు కోట ఎక్కుతున్న దృశ్యం

**గుత్తి, జూలై 25 ప్రభాతవార్త**

గుత్తిలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు గురువారం చారిత్రక నేపథ్యం కలిగిన గుత్తికోటపై ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కోట చరిత్రను, ప్రాశస్త్యాన్ని, కట్టడాల గురించి కోట సంరక్షణ సమితి ఛైర్మన్ విజయభాస్కర్‌చౌదరి, కోట గైడ్ రమేష్ వివరించారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉల్లాసంగా ట్రెక్కింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో చారు, చైతన్య, చిరంజీవి, జిలాన్, హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస డిగ్రీ కళాశాలలో ఏఐసిటిఈ అనుమతి

**- ప్రిన్సిపాల్ ముసలి రెడ్డి వెల్లడి**

**ధర్మవరం, జులై 25 ప్రభాతవార్త**

పట్టణంలోని సాయినగర్‌లోగల శ్రీశ్రీనివాస డిగ్రీ కళాశాల అండ్ పిజి కళాశాలలో బిబిఏ, బిసిఏ కోర్సులతోపాటు 2024-25 సంవత్సరానికి ఏఐసిటిఈ అనుమతి పొందిన ఏకైక పాఠశాల అని ప్రిన్సిపాల్ ముసలిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు డిగ్రీ చేరుటకు రిజిస్ట్రేషన్ చ ఏసుకున్న విద్యార్థులకు, మా కళాశాలలో ఆప్షన్ పెట్టుకోవానలి విద్యార్థులకు తల్లిదండ్రులకు తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9014219361 లేదా 9949206228, 7013145328లో సంప్రదించాలన్నారు.

## బ్రెయిన్ ఫీవర్‌తో చిన్నారి మృతి

**ధర్మవరం, జులై 25 ప్రభాతవార్త**



మృతి చెందిన బాలుడు

నియోజకవర్గంలోని బత్తలపల్లి మండలం అనంతసాగర్‌కు చెందిన రోహిణి కుమార్ సువర్ణల మూడవ సంతానమైన మోక్షజ్ఞ (ఒక సంవత్సరం వయస్సు) అకస్మాత్తుగా మృతి చెందడం జరిగింది. కుటుంబీకులు తెలిపిన ప్రకారం వివరాలకు వెళితే.. రోహిణి కుమార్ సువర్ణలకు మూడవ సంతానముగా మోక్షజ్ఞ జన్మించడం జరిగింది. జన్మించిన తొలుత ఫిట్స్ రావడం జరిగిందని, అనంతరం బాబు పెరిగినప్పటి నుంచి రాలేదని, అనుకోకుండా రెండు రోజుల కిందట వాంతులు కావడంతో అనుకూలమైన చోట చూపించడం జరిగిందని, తదుపరి తగ్గకపోవడంతో బెంగుళూరులో ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించాలన్న ఉద్దేశ్యంతో గుంతకల్లుఓలని వారి బంధువుల ఇంటి నుంచి వారు కారులో బయల్దేరారు. మార్గ మధ్యంలో బాబు ఉలుకు పలుకు లేకపోవడంతో హుటాహుటిన ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఇప్పటికే మృతి చెందిన బాబుకు బెంగుళూరులోని ఆసుపత్రి సిఎంపి ఆసుపత్రిలో 10 లక్షలు, బెంగుళూరు ఉదయ ఆసుపత్రిలో ఒక లక్ష రూపాయలు ఖర్చు చేసినా బాబు బతకలేదని తాత ఆవేదన వ్యక్తం చేశాడు. తండ్రి బెంగుళూరులో ఓ ప్రైవేట్ ఉద్యోగిగా, తల్లి గృహిణజగా ఉండేదని తెలిపారు. రెండవ సంతానం కూడా ఒక సంవత్సరం కిందట రెండు నెలల బాబు ఆకస్మాత్తుగా మృతి చెందడం జరిగిందని తెలిపారు. మేనరికం వివాహం జరిగిందని తెలిపారు. మొత్తం మీద ఈ కుటుంబంలో తల్లిదండ్రులు ఇద్దరు కుమారులను మృత్యువాత పడటం అందరినీ కలచివేస్తోంది. ఈ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కుటుంబ సభ్యులు స్థానికులు కోరుతున్నారు.

## రేపు మండల సమావేశం

**కనగానపల్లి, జులై 25 ప్రభాతవార్త**

రేపు వనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓవెంగన్న తెలిపారు. ఈసర్వసభ్య సమావేశానికి మండలాధికారులు నివేదికలతో హాజరు కావాలని అలాగే ఈ కార్యక్రమానికి ఎంపిటిసిలు, సర్పంచులు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని, ఆయన తెలిపారు.

## పాత పాళ్యంలో దోమల నివారణకు స్ప్రేయింగ్

**కనగానపల్లి, జులై 25 ప్రభాతవార్త**



మండల పరిధజలోని పాతపాళ్యం గ్రామంలో గురువారం గ్రామంలోని ప్రధాన వీధుల్లో అలాగే మురుగు కాలువల వద్ద దోమలు ప్రబలకుండా సర్పంచు రేవతి రాజాకృష్ణ ఆధ్వర్యంలో స్ప్రేయింగ్ చేయించడంజరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

స్ప్రేయింగ్ చేయిస్తున్న సర్పంచు రేవతి రాజా కృష్ణ




## విధానపరిషత్‌లో పలు బిల్లులకు అనుమతి పొందిన సర్కారు



కర్ణాటక విధానపరిషత్‌లో బిల్లుల గురించి మాట్లాడుతున్న సిఎం సిద్దరామయ్య.

**బెంగళూరు,జూలై 25,ప్రభాతవార్త ప్రతినిధి**

ప్రతిపక్షాల ఆందోళన మధ్య కర్ణాటక విధానపరిషత్ నాలుగు ప్రముఖ బిల్లులకు సర్కారు అనుమతి పొందింది.ఈ ఉదయం విధానపరిషత్ సమావేశాలు ప్రారంభం కాగానే సభాపతి ముందున్న వెల్‌లోనికి బిజెపి జెడిఎస్ సభ్యులు ప్రవేశించి ముడా అక్రమాల గురించి సభలో చర్చ జరగాలని ఆందోళనకు దిగారు.సర్కారుకు వ్యతిరేకంగా సిఎంకు వ్యతిరేకంగా వారు జోరుగా నినాదాలు ఇచ్చారు.ఈ గందరగోళం మధ్యలోనే సభాపతి బసవరాజ హొరట్టి విధానసభలో అనుమతి పొందిన నాలుగు ప్రముఖ బిల్లులకు మూజువాణి ఓటుతో అనుమతి ఇచ్చారు.కేంద్ర సర్కారు తీసుకురాదలచిన ఒన్‌నేషన్ ఒన్ ఎలక్షన్ గురించి కర్ణాటక సర్కారు తన వ్యతిరేకతను తెలియజేస్తూ బిల్ తీసుకువచ్చింది.ఈబిల్ గురించి ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాట్లాడుతూ ఒన్‌నేషన్ ఒన్ ఎలక్షన్ దేశంలోని ప్రజాస్వామ్యానికి దెబ్బతీసే చర్యలని ఆరోపించారు.భారతదేశం వంటి ఫెడరల్ వ్యవస్థలో ఇపుడున్న పరిస్థితుల్లో ఒకేదేశం ఒకేసారి ఎన్నికలు అనే విధానం ఎంతమాత్రం సబబుగా లేదని చెప్పారు.ఇలాంటి ప్రయోగాలు అధ్యక్షతరహా పాలన ఉన్న దేశాల్లో సాధ్యం అని చెప్పారు.ఇలాంటి అడ్డగోలు విధానాన్ని దేశంలో ప్రవేశపెట్టి బిజెపి కేంద్రసర్కారు వచ్చేరోజుల్లోన్ల బిజేపీయేతర రాష్ట్రాల ప్రభుత్వాల గొంతును నులిమివేసే ప్రయత్నాలని ఆరోపించారు.ఈ బిల్లు కేంద్రం తీసుకురాదలచిన ఒన్‌నేషన్ ఒన్ ఎలక్షన్ బిల్లును వ్యతిరేకిస్తుందని చెప్పారు.నియోజకవర్గాల కుదింపు ,విస్తరణ బిల్లును కూడా కర్ణాటక సర్కారు వ్యతిరేకిస్తుందని సిఎం చెప్పారు.దేశంలో 2011 తరువాత జనాభా లెక్కలు జరగలేదు.కేంద్ర సర్కారు 1972లో అస్తిత్వంలో ఉన్న అసెంబ్లీ పార్లమెంటు నియోజకవర్గాలను కులాల ఆధారంగా పునర్ వ్యవస్థీకరించేందుకు నియోజకవర్గాల విస్తరణ బిల్లును తెచ్చేందుకు సిద్ధమైంది.దేశంలో తాజా జనాభా లెక్కలు జరిపిన తరువాతనే ఈ నియోజకవర్గాల మార్పులు చేర్పులు చేయాలని కాంగ్రెస్ సర్కారు డిమాండ్ చేస్తూ విధానసభలో పెట్టిన పాస్‌చేసిన బిల్లుకు విధానపరిషత్‌లో ఇవాళ అనుమతి తీసుకుంది. బెంగళూరు నగరం పరిపాలన సౌలభ్యం కోసం బిబిఎంపిను పదిభాగాలుగా విభజించాలన్న గ్రేటర్ బెంగళూరు బిల్లును మరోసారి విధానసభ విధానపరిషత్‌లో చర్చ జరపాలని ప్రభుత్వం తీసుకువచ్చిన ముసాయిదా సవరణలకు విధానపరిషత్ తన ఆమోద ముద్ర వేసింది.కాగా ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ ప్రవేశపెట్టిన నీట్ రద్దు సిఇటి కావాలన్న బిల్లుకు పరిషత్ తన ఆమోద ముద్ర వేసింది. డికె.శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర సర్కారు దేశంలోని వృత్తిపరకోర్సులకు నీట్‌పేరిట పరీక్షలు జరిపి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడారని ఆరోపించారు. నీట్ పరీక్షలను కర్ణాటకలో రద్దు చేసి గతంలో అమల్లో ఉన్న సిఇటి పరీక్షల విధానం అమలుచేసేందుకు బిల్లును ప్రవేశపెట్టారు.దీనికి సభాపతి బసవరాజ హొరట్టి మూజువాణి ఓటుతో అనుమతి ఇచ్చారు. బిజెపి జెడిఎస్ సభ్యులు ఆందోళనల మధ్యనే ఉపసభాపతి ప్రాణేశ్ విధానపరిషత్ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు.

## హాసన్ జిల్లాలో వృద్ధుడిపైన ఎలుగుబంటు దాడి

### - ఆసుపత్రిపాలైన వ్యక్తి

**హాసన్,జూలై 25,ప్రభాతవార్త ప్రతినిధి**

హాసన్‌జిల్లాలో ఒక వంక భారీ వర్షాలతో రైతులు సతమతం అవుతుంటే మరో పక్క పొలాల్లో పనిచేసుకునేందుకు వెళ్లే రైతులపైన ఎలుగుబంట్లు దాడులు పెరిగిపోతున్నాయి.హాసన్ జిల్లా ఆరసీకెరె తాలూకా జన్నావర గ్రామంలో గురువారం ఉదయం పొలంపనులకు వెళ్లిన రైతుపైన ఎలుగుబంటు దాడిచేసి తీవ్రంగా గాయపరచింది.రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల మేరకు మహాలింగప్ప (65)అనే రైతు ఇవాళ ఉదయం తన పొలంలో పనిచేసేందుకు వెళుతుండగా దారిలో పొదలచాటునుంచి వచ్చిన ఎలుగుబంటు రైతుపైన హఠాత్తుగా దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. సహాయం కోసం రైతు కేకలు వేసే సరికి ఎలుగుబంటు అడవిలోనికి పరారయ్యింది. ఎలుగు బంటు రైతు ముఖంపైన తలపైన గోళ్లతో గాయపరచింది.తీవ్రంగా గాయపడిన రైతును అరసీకెరె ఆసుపత్రికి చికిత్సకోసం గ్రామస్తులు తీసుకువెళ్లారు.

## బెంగళూరులో ఒక బారులో పార్టీ చేసుకునేందుకు వచ్చిన పర్యాటకులపై బౌన్సర్ల దాడి

### - ఇద్దరు ఆసుపత్రి పాలు

**బెంగళూరు,జూలై 25,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరులోని అశోక్‌నగర్‌లో ఒక బార్‌లో పార్టీ చేసుకుందామని వెళ్లిన పొరుగురాష్ట్రం పర్యాటకులపైన బార్ సిబ్బంది దాడి చేయటంతో ఇద్దరు వ్యక్తులు ఆసుపత్రి పాలయ్యారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెంగళూరు అందాలను తిలకించటానికి వచ్చిన పొరుగురాష్ట్రం పర్యాటకులు అశోక్‌నగర్ బార్‌లో స్నేహితులతో కలసి మందు పార్టీ చేసుకుంటుండగా అక్కడున్న బౌన్సర్లతో మాటామాటా పెరిగి గొడవ జరిగింది. మందు మత్తులో ఉన్న 6మంది బౌన్సర్లు పర్యాటకులపై పిడిగుద్దులు కురిపించటంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్రమైన గాయాలయ్యాయి.ఈ డ్యాన్సు బార్‌లో జరిగిన గొడవ సమాచారం అందుకున్న పోలీసులు గాయపడిన వారిని ఆసుపత్రికి చేర్చారు.డ్యాన్స్ బార్‌రెస్టారెంటుపై కేసుపెట్టి ముగ్గురు బౌన్సర్లను అదుపులోనికి తీసుకున్నారు.

## బెంగళూరు నగరజిల్లా ఆనేకల్ పట్టణంలో పాతకక్షలకు నగరసభ మెంబరు హత్య

**ఆనేకల్ (బెంగళూరు నగరజిల్లా ),జూలై 25,ప్రభాతవవార్త ప్రతినిధి**

బెంగళూరు నగరజిల్లా ఆనేకల్ పట్టణంలో గురువారం ఉదయం ఇక్కడి నగరసభ సభ్యుడిని కొందరు దుండగులు మారణాయుధాలతో భీకరంగా హత్యచేసి పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆనేకల్ నగరసభ కాంగ్రెస్ మెంబర్ రవి అలియాస్ స్క్రాప్ రవిని పాత కక్షలతో అతడి సహచరులే హత్య చేసి పరారయ్యారు.రెండునెలల కిందట పట్టణంలో ఒక అంగడి వద్ద రుబాబు చేసిన ఆరుగురు మందిని సదరు రవి రక్షించాడని ఈ సంఘటనను కక్షగా పెట్టుకున్న ప్రత్యర్థులు రమేష్ హరీష్ సంతోష్ కలసి ఈ ఉదయం రవిపైన దాడిచేసి హత్యచేశారు.పాతకక్షలే నగరసభ సభ్యుడి హత్యకు కారణమని పోలీసులు తెలిపారు.దుండగులకు చెందిన నివాసాలపైన రవి అనుచరులు దాడిచేసి ఇళ్ల తలుపులు కిటికిలను ధ్వంసం చేశారు. పట్టణంలో ఉద్రిక్తత నెలకొనడంతో నగర పోలీసు అధికారులు అదనపు బలగాలను నగరంలో మొహరించారు.

## విధానసభలో ముడా అక్రమాల కేసు గురించి అహోరాత్రి ధర్నా చేసిన ప్రతిపక్షాలు

### - చర్చకు అనుమతించబోనన్న స్పీకర్ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసిన స్పీకర్

**బెంగళూరు,జూలై 25,ప్రభాతవార్త ప్రతినిధి**



విధానసభ సమావేశాలను వాయిదావేసిన స్పీకర్ యుటి.ఖాదర్ ఫోటో.

మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార జరిగిన అక్రమ నివేశనాల పంపిణీ ఉదంతంలో సిఎం పాత్ర ఉన్నందువలన సిఎం రాజీనామా చేయాలంటూ విధానసభలో బుధవారం రాత్రి నుంచి అహో రాత్రి ధర్నా ఆందోళన నిర్వహించిన ప్రతిపక్షాలు గురువారం కూడా ఉదయంనుంచి సభలో ఆందోళన కంటిన్యూ చేయటంతో స్పీకర్ ప్రతిపక్షాల సావధాన తీర్మానంకు చర్చకు అనుమతి ఇవ్వబోనని తిరస్కరించి రూలింగ్ ఇచ్చారు. అయినా ప్రతిపక్షాలు తమకు న్యాయం చేయాలని ధర్నా కొనసాగించటంతో స్పీకర్ సభలో కర్ణాటక ద్రవ్య వినియోగ బిల్లుకు మరో నాలుగు బిల్లులకు మూజువాణి ఓటుతో అనుమతి ఇచ్చి సభను నిరవధికంగా వాయిదా వేశారు.దీంతో కర్ణాటక శాసనసభ సమావేశాలు నిర్ణయించిన తేదీ కంటే ఒకరోజు ముందుగానే ముగిసిపోయాయి.సమావేశాలు ముగిసిన తరువాత విధానసభ వరండాలో ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ బిజెపి మైసూరుకు పాదయాత్ర అయినా చేయనీ లేదంటే ఢీల్లీ వరకు పాదయాత్ర చేసుకోని మేము వీటి గురించి ఆందోళన చెందబోమన్నారు.గత బిజెపి సర్కారు ముడా భూములను సిఎం కుటుంబానికి కేటాయించి ఇపుడు వారే సిఎం రాజీనామా కోసం డిమాండ్ చేస్తున్నారు.బిజెపి హయాంలో జరిగిన అక్రమాలను బయటకు లాగి దర్యాప్తు చేస్తామని తెలిపారు.బిజెపి హయాంలో జరిగిన అక్రమాల దస్తరాలను అన్నిటిని బయటపెడతానని శివకుమార్ చెప్పారు. మంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ బిజెపి వారికి పాదయాత్ర ఫ్యాషన్ అయ్యిందని విమర్శించారు.కాంగ్రెస్ మాదరిగా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసే ఇక బిజెపిని ఏమని చెప్పాలన్నారు.వారికి ఈ పాదయాత్ర రాజకీయ అస్త్రం అని చెప్పారు.

## సినీహీరో దర్శన్‌కు ఇంటిభోజనం సరఫరా మనవిని కొట్టివేసిన జడ్జి

**బెంగళూరు,జూలై 25,ప్రభాతవవార్త ప్రతినిధి**

రేణుకాస్వామి హత్యకేసులో అరెస్టు అయిన సినీహీరో దర్శన్ గత నెల రోజులుగా ఇక్కడి పరప్పన అగ్రహార సెంట్రల్‌జైల్లో ఉన్నాడు.తనకు జైలు ఆహారం పడటంలేదని ఇంటి భోజనంకు అనుమతి ఇవ్వాలని ఇతడు కోర్టుకు మొరపెట్టుకోగా బెంగళూరుకోర్టు దీనిని తోసి పుచ్చింది.బెంగళూరు ఆర్థికనేరాల న్యాయస్థానం జడ్జి విశ్వనాథ గౌడర్ ఈమేరకు దర్శన్ పెట్టుకున్న మనవి కేసును గురువారం కొట్టివేశారు. గంభీరమైన నేరాల్లో జైలుపాలైన నిందితులకు ఇంటినుంచి భోజనం సరఫరా సౌకర్యం కల్పిస్తే ఇంటి భోజనం వలన జరగరాని ప్రమాదం ఏదైనా చోటు చేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించిన న్యాయమూర్తి ఇలాంటి మనవిలను కోర్టు ఎప్పుడూ పురస్కరించబోదని చెప్పి దర్శన్ మనవిను తోసిపుచ్చారు.దీంతో దర్శన్‌కు బెంగళూరు జైలు భోజనమే చివరికి దక్కింది.

## యడ్యూరప్ప హయంలోనే ముడా అక్రమాలు జరిగింది ఎవరికోసం పాదయాత్ర

### బిజెపి ఎంఎల్ఎ కేంద్ర మాజీ మంత్రి బసవనగౌడ పాటిల్ యత్నాళ్

**బెంగళూరు,జూలై 25,ప్రభాతవార్త ప్రతినిధి**



బిజెపి సభ్యుడు బసవనగౌడ పాటిల్ యత్నాళ్.

కర్ణాటకలో ప్రధాన ప్రతిపక్షపార్టీ పలు సందర్భాల్లో సర్కారుతో అడ్జస్టుమెంట్ రాజకీయాలను నడుపుతుండటంతో మా పార్టీ చేపట్టే ఆందోళనలకు మహత్యం ఉండటం లేదని విజయపుర బిజెపి ఎంఎల్ఎ కేంద్ర మాజీ మంత్రి బసవనగౌడ పాటిల్ యత్నాళ్ గురువారం ఆరోపించారు.ఆయన ఇవాళ విధానసభ సమావేశాల్లో పాల్గొని బయటకు వచ్చిన తరువాత మీడియాతో మాట్లాడారు.మాపార్టీ బిజెపి ఇక్కడ అడ్జస్టుమెంట్ పాలిటిక్స్ నడిపినంత కాలం ఎన్నిపోరాటాలు చేసినా ఆందోళనలు జరిపినా ఏమీ ప్రయోజనం ఉండదని చెప్పారు. ముడా కేసులో సిఎం రాజీనామా కోసం విధానసభలో స్పీకర్ వెల్‌లో ధర్నా చేసిన బిజెపి సభ్యుల్లో ఒక ప్రముఖ నాయకుడు పనిలోపనిగా తన నియోజకవర్గం పనుల కోసం ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్‌ను చర్చలు జరపటం దేనిని సూచిస్తుందని ప్రశ్నించారు.ఇలాంటి నాయకులు ఉన్నంత కాలం ప్రతిపక్షంగా బిజెపి ఎలా నెట్టుకొస్తుందని నిలదీశారు.ముడా లో అక్రమంగా వేలకొద్ది నివేశనాలు పంపిణి జరిగింది యడ్యూరప్ప కాలంలోనే అని చెప్పారు.ఈయనకు తెలియకుండా ముడాలో నివేశనాలు పంపిణి జరగలేదని చెప్పారు.సిద్దరామయ్య సర్కారు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బివై.విజయేంద్ర మొదట తమ పూజ్యతండ్రి హయాంలో జరిగిన ముడా అక్రమాల గురించి ఏమి బదులు చెబుతాని నిలదీశారు.ప్రతిపక్షంగా బిజెపి గట్టి నిర్ణయాలు తీసుకుని వాటికి కట్టుబడి పనిచేస్తే పలితాలు వస్తాయి.బిజెపిఅధ్యక్షుడు తొందరపడి ఛలో మైసూరు యాత్ర నిర్ణయం సమర్థనీయంగా లేదని అన్నారు.ఇది ఏకవ్యక్తి నిర్ణయం అని చెప్పారు.నేను ఎప్పటికి విజయేంద్ర నాయకత్వాన్ని అంగీకరించే ప్రశ్నే లేదని బసవనగౌడ పాటిల్ యత్నాళ్ చెప్పారు.

## మండ్యలోను ముడా అక్రమాల మాదరిగా నిధుల బదలాయింపు

### - కేసు నుంచి జామీను పొందిన బిజెపి నాయకులు

**మండ్య,జూలై 25,ప్రభాతవార్త ప్రతినిధి**

మండ్య నగరాభివృద్ధి ప్రాధికార లోను మైసూరు కార్పొరేషన్ మాదిరి నిధుల మళ్లింపు అక్రమాలు బయటపడటంతో గురువారం ఈకేసు కొత్తరూపు సంతరించుకుంది.మండ్య నగరాభివృద్ధి ప్రాధికార జగదీశ్ షెట్టర్ సిఎంగా ఉన్న కాలంలో 5కోట్ల రూపాయలను బదిలీ నివేశనాలకు పరిహారంగా ముడా నుంచి అక్రమంగా ఇతరుల ఖాతాలకు మళ్లించటంతో ముడా కమిషనర్ హెచ్‌ఎస్ శివరామ్ కేసు పెట్టడంతో అక్రమాల కేసు వెలుగుచూసింది.ముడా 5కోట్ల రూపాయల నిధులను మళ్లింపు గురించి పోలీసులు కోర్టులో కేసు పెడితే నిందితులు కోర్టు నుంచి జామీను పొంది బయట తిరుగుతున్నారని మండ్య కాంగ్రెస్ ఎంఎల్ఎ రవికుమార్ గణిగ చెప్పారు.ఈకేసును కాంగ్రెస్ సర్కారు ఇపుడు తిరగదోడి నిందితులకు జైలుశిక్ష వేయిస్తామని చెప్పారు.బిజెపి సర్కారు హయాంలో ఒక్కొక్క అక్రమాల కేసు బయటకు తీస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు చెప్పారు.

## మహారాష్ట్ర కోయ్నా జలశయం నుంచి పెద్దఎత్తున నీరు విడుదల

### - ఘటప్రభ ఆనకట్ట నీరు విడుదల

**బెళగావి,జూలై 25,ప్రభాతవవార్త ప్రతినిధి**

మహారాష్ట్ర కోయ్నా జలశయం నుంచి పెద్ద ఎత్తున వరదనీరు కర్ణాటకకు వదలటంతో గురువారం బెళగావి గుండా ప్రవహించిన నీరు ఘటప్రభ ఆనకట్టవద్ద సేకరణ జరిగి వరదపరిస్థితి తలెత్తటంతో ఘటప్రభ ఆనకట్ట నుంచి నదికి 10వేల క్యూసెక్కుల జలాలను వదిలిపెట్టారు.దీనివలన బెళగావి జిల్లా గోకాక్ తాలూకాలో వరద పరిస్థితి తలెత్తింది.తాలూకాలోని ఘటప్రభ నది వెళ్లే గ్రామాల వాసులు సురక్షిత స్థలాలకు తరలి వెళ్లాలని జిల్లా కలెక్టర్ మహమద్ రోషన్ జిల్లా యంత్రాంగానికి సూచించారు. జిల్లాలోని మార్కెండేయ,హిరణ్యకేశి, దూద్‌గంగా,వేదగంగా, కృష్ణ మలప్రభ నదులు జోరుగా వరద ప్రవాహంతో పరుగులు తీస్తున్నాయి. పరిహార చర్యలకోసం అన్నితాలూకాలయంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ సన్నద్ధం చేశారు.

## తుమకూరులో తారు గుండిలో పడిపోయిన గొర్రెల కాపరిని కాపాడిన బెటాలియన్ పోలీసులు

**తుమకూరు,జూలై 25,ప్రభాతవవార్త ప్రతినిధి**

తుమకూరు నగర బయట పావగడ రోడ్డుకోసం వేస్తున్న తారు పనుల వలన అక్కడ స్టాకు చేసిన తారు పీపాల గుండిలో గురువారం ఉదయం ఒక గొర్రెల కాపరి తన గొర్రెలను కాపాడబోయి గుండిలో పడిపోవటం సహాయం కోసం కేకలు వేయటంతో అదే దారిలో వెళుతున్న పదో బెటాలియన్ పోలీసులు రెస్క్యూ చేసి గొర్రెలను గొర్రెల కాపరిని కాపాడారు. తుమకూరులో ఎండవేడిమి అధికంగా ఉండటం, తారు గుండిలో కాగిపోయిన స్థితిలో ఉన్నందువలన గొర్రెల కాపరి శామణ్ణ గుండిలోని తారులో కూరుకుపోయాడు. దాదాపు రెండు గంటలసేపు ఇతడు సహాయం కోసం కేకలువేసినా ఎవరూ అందగా రాలేదు. అదే దారిగుండా వాహనంలో వెళుతున్న బెటాలియన్ పోలీసులు యువకుడి కేకలు విని తారు గుండివద్దకు చేరుకుని యువకుడిని గొర్రెలను రక్షించారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

**అమరాపురం, జూలై 25 ప్రభాతవార్త**



విరాళం అందజేస్తున్న దృశ్యం

మండలంలోని బసవనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి రాష్ట్ర మాజీ కుంచిటి ఒక్కలిగా కార్పొరేషన్ డైరెక్టర్ రాజేశ్వరి శంకర్‌రెడ్డి 10 వేల రూపాయలను విరాళంగా అందచేశారు. శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి భక్తులు ఈ దేవాలయాన్ని దాతల సహకారంతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ ఆలయ నిర్మాణానికి కుంచిటి వక్కలిగా కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాజేశ్వరి శంకర్‌రెడ్డి తనవంతు చేయూతనందించారు. ఈ విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన రాజేశ్వరి శంకర్‌రెడ్డిలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి - ఎస్ఐ జనార్ధన్‌నాయుడు

**అమరాపురం, జూలై 25 ప్రభాతవార్త**



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల లో విద్యార్థులకు అమరా పురం ఎస్ఐ జనార్ధన్‌నాయుడు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలు, బాలికల పట్ల గౌరవంగా సమాజంలో మెలగాలని అదేవిధంగా డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా వుండాలని నిలుపునిచ్చారు. అదేవిధంగా ర్యాగింగ్, బాల్య వివాహాలు, రహదారిపై ప్రయాణం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో వున్న అనేక రుగ్మతలను రూపుమాపాలంటే విద్యార్థుల పాత్ర ఎంతో ఆవశ్యకమన్నారు. నేటి బాలులే రేపటి పౌరులనే నానుడిని ప్రతి ఒక్క విద్యార్థి అలవర్చుకోవాలన్నారు. దేశానికి సేవ చేసే వ్యక్తులుగా ఎదగాలని, దురలవాట్లకు దూరంగా వుండాలని మంచి అలవాట్లను ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రామాంజినేయులు, కానిస్టేబుల్ శ్రీనాథ్, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ బృందం సంజప్ప, మద్దిలేటి, వేణుగోపాల్‌రెడ్డి, సత్యం, నాగిరెడిడ, రామసుబ్బయ్య, అనిల్, కంప్యూటర్ ఆపరేటర్ మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించండి - ఎంపిడిఒ భాస్కర్

**అమరాపురం, జూలై 25 ప్రభాతవార్త**



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, మురుగు కాలువలు శుభ్రపరచడంతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ కార్యదర్శుల కు ఎంపిడిఒ భాస్కర్ సూచించారు. మండల కేంద్రంలోని సమావేశభవనంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ దోమల నివారణ చర్యలు చేపట్టి సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా తాగునీరు. పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు భాస్కర్, ఈరన్న, నరేష్‌బాబు, మనోహర్‌శర్మ, గోపి, గ్రేట్ 5 కార్యదర్శులు, సచివాయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే, మాజీ ఎంఎల్‌సి చొరవతో కదిలిన ఆరోగ్య సిబ్బంది

**అమరాపురం, జూలై 25 ప్రభాతవార్త**



వైద్య సిబ్బంది ఇంటి సర్వే చేస్తున్న దృశ్యం

మండలంలోని హేమావతి గ్రామ పంచాయతీ కెంకెర గ్రామంలో గత కొన్ని రోజుల నుండి ప్రజలు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ వైద్యకోసం కర్ణాటక లోని ఆసుపత్రులకు వెళుతున్నారు. విషయం తెలుసుకున్న మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, తెలుగుదేశం పార్టీ మడకశిర ఇన్‌చార్జ్, మాజీ ఎంఎల్‌సి గండుమల తిప్పేస్వామి ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే ఆరోగ్య సిబ్బందిని కెంకెరకు వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భార్గవ్ తమ సిబ్బందితో కలిసి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వేతో పాటు వాంతులు, విరేచనాలు వుంటే తక్షణం హేమావతి పిహెచ్‌సికి రావాలని ప్రజలకు వివరించారు. వైద్యాధికారులను పంపించినందుకు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే, మాజీ ఎంఎల్‌సిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 15 మంది రైతుల 11 ఎకరాల భూమిని మరొకరికి చేర్చిన అధికారులు.

### - తహసిల్దార్ హామీతో సర్దుమణిగిన సమస్య



తహసిల్దార్‌తో వాగ్వాదానికి దిగిన రైతులు

**గోరంట్ల జులై 25 ప్రభాతవార్త**

మండలంలోని వానవోలు పంచాయితీలో గల గుంటు పల్లికి రైతులకు సంబంధిం చిన 15 సర్వే నెంబర్లులో ఎలాంటి ఆధారాలు లేకుం డా కనీసం సాగులో కూడా లేని ఒడిసి మండలానికి చెందిన వ్యక్తికి అక్రమంగా రికార్డులతో చేర్చారని ఆగ్రహించి రైతులు స్థానిక తహసిల్దార్ కార్యాలయం చేరుకొని తహసిల్దార్ అక్బర్ భాషాతో వాగ్వాదానికి దిగిన సంఘటన గురువారం చోటు చేసుకుంది.మండలంలోని వానవోలు పంచాయితీ గుంటుపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి రైతుకు చెందిన మూడున్నర ఎకరా ఎస్ భయపరెడ్డికి చెందిన 50 సెంట్లు ఆదినారాయణ రెడ్డికి చెందిన 90 సెంట్లు,ఎం వెంకటశివారెడ్డి కి చెందిన ఎకరా 40 సెంట్లు గుంటుపల్లి నాగేష్ కు చెందిన 48 సెంట్లు జి ఈశ్వరయ్యకు చెందిన 53 సెంట్లు లక్ష్మినరసమ్మ,తిమ్మప్ప కేశవకు చెందిన 2.45 సెంట్లు తో పాటు ప్రభుత్వ పాఠశాల సర్వే నెంబర్ 510 రెండవ లెటర్‌లో ఎకరా 16 సెట్లు ఈ నెల 22వ తేదీన 11 ఎకరాలను ఒడిసి మండలం కొండకమర్లకు చెందిన ఈశ్వర్‌రెడ్డి పేరున ఎలా మార్చరని ఆందోళనకు దిగారు రైతులు సమస్యను వివరించిన కూడా ఎలా రికార్డులలో చేర్చారని ఒక రైతు పెట్రోల్ బాటిల్‌తో మండిపడ్డారు దీంతో తహసిల్దార్ పుట్టపర్తి ఆర్డీఓ మరియు జిల్లా అధికారులతో సమస్యను వివరించి వెంటనే గతంలో ఉన్న మాదిరిగా దానిని మార్చచయడంతో సమస్య సర్దుమణింగింది.ఇలాంటి సంఘటన మళ్ళి పునరావృతమైతే ఆందోళ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతులు లక్ష్మినారాయణరెడ్డి, నాగేష్,మునీంద్ర, వెంకటరెడ్డి, వేణుగోపాల్,భయపరెడ్డి,సత్యనారాయణ,తిరుపాల్,రామిరెడ్డి, పాల్గొన్నారు.

## జూదరులు అరెస్టు



మంగపట్ట ఆడుతున్న వారిని అరెస్టు చేసిన దృశ్యం

**తాడిమర్రి, జులై 25 ప్రభాతవార్త**

మండలంలోని రామాపురం గ్రామం వద్ద మంగపట్ట ఆడుతున్న ఆరు మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,800 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. రాబడిన సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించి వారి వద్ద ఉన్న నగదును, సెల్‌ఫోన్‌ను ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కోర్టుకు పంపించామన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి



వైద్యశాలలో జింకకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న సిబ్బంది.

**గోరంట్ల జులై 25 ప్రభాతవార్త**

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన సంఘటన గోరంట్ల మండలంలోని రాగిమాకులపల్లి గ్రామ సమీపాన చోటుచేసుకుంది గురువారం ఒక సంవత్సరం వయసు గల మగ కృష్ణ జింక రాకుమాకులపల్లి గ్రామ సమీపాన్ని గల బెంగుళూరు బెపాస్‌లో గాయపడి రోడ్డు మీద పడి ఉండగా గమనించిన గ్రామస్తులు మరియు గ్రామ ఎంపిపి స్కూల్ ఉపాధ్యాయులు వెంటనే ఫారెస్టు ఆఫీసర్ రాహుల్‌కి తెలియజేశారు.సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది సంఘటన స్థలానికి చెరుకొని జింకను పరిశీలించగా పొట్టమీద తీవ్ర గాయాలతో జింక అప్పటికే మరణించినట్లు తెలుసుకున్న అటవీ సిబ్బంది గోరంట్ల పశు వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించి తదనందరం జింకను దహనం చేశారు.

## పశువుల అక్రమ రవాణా అడ్డగింత

**గోరంట్ల జులై 25 ప్రభాతవార్త**

పుశువుల సంత నుండి అక్రమంగా ఐచర్ వాహనంలో తమిళనాడు ప్రాంతానికి పశువులను తరలిస్తుండగా గురువారం ఉదయం బిజెపి,జనసేన నాయకులు అడ్డుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు.సిఐ సుబ్బరాయుడు తెలిసిన వివరాల మేరకు గోరంట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డిచెరువు కట్ట వద్ద గురువారం ఉదయం 27 పశువులను 2 ఐచర్ వాహనాలలో తరలిస్తుండగా మార్గమధ్యలో అడ్డుకున్నారు.గోరంట్ల పట్టణంలోని ప్రభుత్వ మార్కెట్ యార్డ్ నుండి అక్రమంగా ప్రత్యేక వాహనంలో రవాణా దారులు గోరంట్ల నుంచి తమిళనాడు వైపు తరలిస్తుండగా స్థానిక బిజెపి మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి వెంకటాచలం,బోయ లక్ష్మి నారాయణ,లక్ష్మినరసు,జనసేన జిల్లా కార్యదర్శి సురేష్ లతో పాటు పలువురు యువకులు పశువుల రవాణాను అడ్డుకున్నారు.వాహనాలను అడ్డుకున్న నేతలు నేరుగా 100 కు కాల్ చేసి 4 వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అయితే బొలేరో వాహనాలలో రైతులు వ్యవసాయానికి తరలిస్తుండగా వారిని వదలిపెట్టారు అయితే తమిళనాడుకు తరలిస్తున్న రెండు ఐచర్ వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.



పశువుల వాహనాలను అడ్డుకున్న బిజెపి,జనసేన నాయకులు.

